
# నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, ఆదివారం 24 నవంబర్ 2024 | KAMAREDDY


## దెబ్బ కొట్టిన తెలుగోళ్లు..

తెలంగాణకు పశ్చిమ దిక్కున మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ స్థానం ఉంటుంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి వసంత్ రావు చౌహాన్ విజయం సాధించారు. ఎంపీగా గెలిచిన రెండు నెలలకే ఆయన మరణించడంతో అసెంబ్లీతో పాటే ఈ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్‌ను ప్రజలు ఓడించినంత పనిచేశారు. సిట్టింగ్ సీటును కాపాడుకునేందుకు రాహుల్‌గాంధీతోపాటు తెలంగాణ మంత్రులు, ఎంపీలు నాందేడ్‌లో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ప్రధానంగా తెలంగాణ వాసుల దెబ్బ గట్టిగానే తగిలింది. ఈ లోక్‌సభ పరిధిలోని నాయ్‌గావ్, దెగ్లూర్, ముఖేడ్, బోకర్‌లో తెలంగాణ వాసులు పెద్దసంఖ్యలో ఉన్నారు. నాందేడ్ నగరంలో 40వేల మంది వరకు తెలుగు మాట్లాడే వారున్నారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేయలేక 'చేతు'లెత్తేసిన దరిమిలా.. మహారాష్ట్రలోని తెలుగు వారు నాందేడ్ లోక్‌సభ పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో హస్తం పార్టీకి తగిన బుద్ధి చెప్పారు. సిట్టింగ్ స్థానమైన దెగ్లూర్‌లోనూ కాంగ్రెస్‌కు పరాజయమే మిగిలింది.



# ఉతికి 'ఆరే'శారు

- మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు పరాభవం
- బోల్తా కొట్టిన ఆరు గ్యారంటీల ప్రచారం
- మరాఠ్వాడాలో పని చేయని మనోళ్ల మంత్రాంగం
- సీఎం రేవంత్, మంత్రులు ప్రచారం చేసిన చోట ఓటమి
- తీవ్ర ప్రభావం చూపిన తెలంగాణ ప్రాంతవాసులు
- మన సరిహద్దు ప్రాంతాల్లో అన్ని చోట్లా రిక్త'హస్తమే'

నిజామాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/బోధన్, రెంజల్, బోధన్ రూరల్ : తెలంగాణకు పట్టిన గతి తమకు రావొద్దనుకున్నారో ఏమో కానీ మరాఠా ప్రజలు హస్తం పార్టీకి రిక్త 'హస్తం' చూపించారు. ప్రచారంలో ఆరు గ్యారంటీలతో ఊదరగొట్టిన కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టారు. ఆరు గ్యారంటీ పేరిట కర్ణాటక, తెలంగాణ ప్రజలను నమ్మించినట్లే మహారాష్ట్ర వాసులను బుట్టలో వేసుకోవాలనుకున్న హస్తం నేతలకు పరాభవమే మిగిలింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర ఓటమి మూటగట్టుకున్నది. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో అక్కడి ప్రజలు కాంగ్రెస్‌ను ఛీకొట్టారు. కర్ణాటక, తెలంగాణలో గద్దెనెక్కాక హామీలను మరిచిన ఆ పార్టీని ఉతికి 'ఆరే'శారు.

### తెలంగాణ నేతలకు చుక్కెదురు..

మహారాష్ట్రలో ముమ్మర ప్రచారం చేసిన తెలంగాణ కాంగ్రెస్ నేతలకు మరఠ్వాడ ప్రజలు షాక్ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విరివిగా ప్రచారం చేశారు. కానీ, వారు ప్రచారం చేసిన అన్నిచోట్లా హస్తం పార్టీని ఓడగొట్టారు. తెలంగాణలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండానే చేస్తున్నట్లుగా చెప్పుకొచ్చిన అబద్ధాన్ని మరాఠా ఓటర్లు ఓడించారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామని ఎన్ని గప్పాలు కొట్టినా మహారాష్ట్ర ప్రజలు బోల్తా పడలేదు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సమీపంలోని నాయగావ్, దెగ్లూర్, బోకర్, ముద్‌ఖేడ్‌లో కాంగ్రెస్ ఓడిపోయింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పక్కనున్న అర్ని, కిన్వట్ నియోజకవర్గాల్లోనూ చతికిలపడింది. ఆదిలాబాద్ తూర్పునున్న మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలతో కలిసి సరిహద్దు పంచుకుంటున్న అహేరి నియోజకవర్గంలో ఏకంగా మూడో స్థానానికి పడిపోయింది. ఆసిఫాబాద్ పక్కనున్న చంద్రాపూర్ నియోజకవర్గంలోనూ హస్తం పార్టీకి ఓటమి తప్పలేదు.

### 'చేయి'ని మడతేసి..

మహారాష్ట్రలో దశాబ్దాలుగా నివసిస్తున్న తెలంగాణ వాసులు 'చేయి'ని మడతపెట్టి దెబ్బకొట్టారు.స్వరాష్ట్రం తెలంగాణలో తమ బంధువులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మదిలో పెట్టుకుని ఓటుతో సమాధానమిచ్చారు. ఆరు గ్యారంటీల ఫెయిల్యూర్ స్కీములను అక్కడి తెలుగోళ్లు నమ్మలేదు. తెలుగు భాష పేరుతో ప్రచారానికి వచ్చిన తెలంగాణ ప్రాంత మంత్రులు, ముఖ్యమంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలకు తగు రీతిలో బుద్ధి చెప్పారు. ఇచ్చిన హామీలను 11 నెలల కాలంలో అమలు చేయని అసమర్థ కాంగ్రెస్ తమకు వద్దే వద్దంటూ ఓటుతో తిరస్కరించారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల ప్రచారం తమకు లాభిస్తుందని భావించిన ఏఐసీసీ పెద్దలకు నిరాశే మిగిలింది. రేవంత్ అండ్ కో ప్రచారం ఏ మాత్రం ఉపయోగపడలేదన్న చర్చ కాంగ్రెస్‌లో మొదలైంది. జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ ఇన్‌చార్జిగా ఉన్న నాందేడ్ లోక్‌సభ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఖాతా తెరువలేదు. ఏఐసీసీ ఆదేశాలతో తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, పీసీసీ డెలిగేట్స్ అంతా కలిసి ప్రచారం చేసినా ఫలితం దక్కలేదు. మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు ఎదురైన పరాభవమే తెలంగాణలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల పోరులో కనిపిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

### ఆరుగ్యారెంటీలతో మోసంచేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పినం..



ఏడాది కింద మా పక్కన తెలంగాణాలో కాంగ్రెస్ మస్తు హామీలు ఇచ్చింది. ఆరు గ్యారెంటీలని ఏమో చెప్పింద్రు.. ఒక్కటి కూడా అమలుకాలేదని తెలంగాణ ప్రజలు అంటుంద్రు.. ఆ ప్రభావం ఇక్కడ చూపించింది. మా నాందేడ్ జిల్లాలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వచ్చి ప్రచారం చేసిండు.. ప్రజలు నమ్మలేదు. తెలంగాణాలో హామీలు ఇచ్చి అమలు చేయని కాంగ్రెస్‌కు ఇక్కడ ఓట్లు వేయలేదు.

**- చంద్రకాంత్ లోకాండె, సగ్రోలి పాఠక్, సరిహద్దు గ్రామాల సమస్యల పోరాట కమిటీ కో-ఆర్డినేటర్, దెగ్లూర్ - బిలోలి నియోజకవర్గం, మహారాష్ట్ర**

### రైతులకు కాంగ్రెస్ ఏం చేయలేదు..



గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయలేదు.. తెలంగాణాలో బీఆర్ఎస్ సర్కార్ రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ వచ్చినంక రైతుబంద్ బంద్ చేసింద్రు.. ఇక్కడ రైతులకు అటువంటి స్కీమ్‌లు కాంగ్రెస్ ఇస్తదన్న నమ్మకం లేకుండా పాయె.. కాంగ్రెసోళ్లు అది చేస్తాం.. ఇది చేస్తాం అని ప్రచారం చేసింద్రు.. ఎవరూ వాళ్ల మాటలు పట్టించుకోలేదు..

**- మారుతీ పటేల్, రైతు, కార్ల పాఠక్, దెగ్లూర్ - బిలోలి నియోజకవర్గం, మహారాష్ట్ర**

### రూ.3 లక్షల రుణమాఫీ అన్నారు.. తెలంగాణలోనే ఇవ్వలేదు..



మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.3 లక్షల రుణమాఫీ చేస్తామన్నరు.. అయినా.. మేం నమ్మలేదు. తెలంగాణలో కూడా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పింద్రు.. చెప్పినంక ఏడాదికి రుణమాఫీ చేసింద్రు.. అయితే, అందరికీ చేయలేదని తెలిసింది. తెలంగాణలో రూ.2 లక్షలే రుణమాఫీ చేయనోళ్లు ఇక్కడ ఏం చేస్తారు అని ప్రజలు అనుకున్నారు. కాంగ్రెసోళ్లు చెప్పిన మాటలు వినకుండా.. ఆ పార్టీకి ఓట్లేయలేదు..

**- పర్బూరి, రైతు, ఏస్సీ, దెగ్లూర్ - బిలోలి నియోజకవర్గం, మహారాష్ట్ర**

### కాంగ్రెస్ మస్తు హామీలు ఇచ్చినా జనం నమ్మలేదు..



మా మరాఠ్వాడాలో కాంగ్రెస్ పార్టీ మస్తు హామీలు ఇచ్చినా ఎవరూ నమ్మలేదు.. నేను కూడా కాంగ్రెస్‌కు ఎన్నోసార్లు ఓటేశాను.. ఇప్పుడు ఆ పార్టీకి ఓటేయడం లేదు. మాకు పక్కనే తెలంగాణ సరిహద్దు గ్రామాలతో బంధుత్వాలు ఉన్నాయి. అక్కడ ఏం జరుగుతున్నదో ఇక్కడి మందికి తెలిసిపోయింది. కాంగ్రెసోళ్లు రైతుబంధు ఆపివేసింద్రని, రుణమాఫీ ఫుల్‌గా చేయలేదని ఇక్కడి మంది చెప్పుకుంటున్నరు. అక్కడ చేయనివాళ్లు ఇక్కడ ఎందుకు చేస్తారని అనుకుని కాంగ్రెస్‌కు ఓటేయలేదు.

**- సుభాష్ దిగంబర్‌రావు నర్ధావార్, రైతు, నాయగావ్, నాయగావ్ అసెంబ్లీ నియోజకవర్గం, నాందేడ్ జిల్లా, మహారాష్ట్ర**

### మహారాష్ట్రలో రేవంత్‌రెడ్డి ప్రభావం పడలేదు



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం మహారాష్ట్రలో ఏమాత్రం ప్రభావం చూపలేదు. సాధ్యం కాని పథకాలను ఇక్కడి ఓటర్లను ఆకర్షించేందుకు రేవంత్‌రెడ్డి చేసిన మంత్రం బెడిసికొట్టింది. తెలంగాణ మంత్రులు, ఎంపీలు చెప్పిన మాయమాటలకు ఇక్కడి ప్రజలు ఓటు రూపంలో బుద్ధి చెప్పారు.

**- సాయినాథ్ సిర్పూరే, ధర్మాబాద్**

### కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజలు తిరస్కరించారు..



తాము అధికారంలోకి వస్తే లాడ్‌కీ బైన్ యోజన పథకాన్ని రెట్టింపు చేస్తాం, ఫ్రీ బస్, ఇంటికో ఉద్యోగం ఇస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినా.. ఓటర్లు తిరస్కరించారు. మోదీతోనే అభివృద్ధి సాధ్యమని అన్ని పట్టం కట్టారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న లాడ్‌కీ బైన్ యోజన అడపడుచులకు అపన్నహస్తంగా ధైర్యాన్ని ఇచ్చింది.

**- వీరాలాల్ గోజాన్ జైన్, ధర్మాబాద్**

## బస్వాపూర్ సొసైటీ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

భిక్కనూరు, నవంబర్ 23: మండలంలోని బస్వాపూర్ సింగిల్ విండో చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. చైర్మన్ కిష్టాగౌడ్‌పై పాలకవర్గ సభ్యులు గతంలో అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. దీంతో అప్పట్లోనే ఈ నోటీసుపై సమావేశం నిర్వహించినప్పటికీ, కోర్టు ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేయలేదు. తాజాగా డీసీవో రామ్మోహన్ అవిశ్వాస సమావేశానికి సంబంధించిన ఫలితాన్ని శనివారం వెల్లడించారు. చైర్మన్ కిష్టాగౌడ్‌పై పాలకవర్గసభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గిందని తెలిపారు. దీంతో ఆయన చైర్మన్ పదవి కోల్పోయాడని, ఇక నుంచి డైరెక్టర్‌గా మాత్రమే కొనసాగుతారని తెలిపారు. పాలకవర్గ సభ్యులు, వైస్ చైర్మన్ యథావిధిగా కొనసాగుతారన్నారు. చైర్మన్ ఎన్నికపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని డీసీవో తెలిపారు.

## ఘనంగా కాలభైరవుడి జన్మదినోత్సవం



బంగారు భైరవ విగ్రహాన్ని తీసుకువస్తున్న ఆలయ ఈవో, పూజారులు



బంగారు కాలభైరవస్వామి విగ్రహం

రామారెడ్డి, నవంబర్ 23 : ఇసన్నపల్లి – రామారెడ్డిలో కొలువైన కాలభైరవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అష్టమి తిథి సందర్భంగా స్వామి వారి జన్మదినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పూజారులు రాచర్ల శ్రీనివాస్, మనీశ్ శర్మ, వంశీ శర్మ, ఈవో ప్రభు రామచంద్రం సమక్షంలో ధ్వజారోహణం, సింధూర మహాపూజ, భద్రకాళీపూజా కార్యక్రమాలు కొనసాగాయి. భైరవుడి బంగారు విగ్రహాన్ని ఎదుర్కొని వచ్చి ఊయల సేవ నిర్వహించారు. ఇసన్నపల్లి గ్రామస్తులు ఎడ్లబండ్లను డప్పువాయిద్యాల మధ్య స్వామి వారి ఆలయం చుట్టూ తిప్పారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రామారెడ్డి ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వడ్ల పైసలు వస్తలే..

- పక్షం రోజులైనా పడని డబ్బులు
- ఇబ్బందుల్లో రైతన్నలు
- రబీ సాగుకు పెట్టుబడి లేక అయోమయం
- రైతుబంధు రాక సతమతం
- పంట పైసలు అందక ఆగమాగం

ధర్పల్లి, నవంబర్ 23 : కాంగ్రెస్ హయాంలో రైతుల కష్టాలు రెట్టింపయ్యాయి. పంట పండించడం ఒకెత్తయితే అమ్ముకోవడం మరో ఎత్తులా మారింది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం, కాంటాలు వేయడంలో ఆలస్యం.. తీరా పంటను అమ్ముకున్నాక డబ్బులు రాక రైతు ఆగమవుతున్నాడు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను కోతలు కోసినాక పక్షం రోజులకు కానీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇక, సంచులు వచ్చి, కాంటాలు వేయడానికి మరో నెలరోజులకు పైగా పట్టింది. హమ్మయ్య.. ఎట్టకేలకు పంట అయితే అమ్ముకున్నామని సంబురపడ్డ రైతులకు ఆ సంతోషం లేకుండా పోతున్నది. వడ్లు అమ్మి పక్షం రోజులైనా డబ్బులు రాకపోవడంతో అన్నదాతలు ఆగమవుతున్నారు.

### భారీగా వరి సాగు..

ఉమ్మడి జిల్లాలో వానకాలంలో భారీగా వరి సాగైంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కలిపి లక్షలాది ఎకరాల్లో రైతులు నాట్లు వేశారు. అయితే, పంట చేతికొచ్చే సమయంలోనే ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాల్సి ఉండగా, కాంగ్రెస్ సర్కారు పట్టించుకోలేదు. కేసీఆర్ పాలనలో పంట కోతల సమయానికే ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేసే వారు. గన్నీబ్యాగులు, హమాలీలతో పాటు మిల్లర్ల కేటాయింపు పూర్తిచేసి, కొనుగోలు వెంటవెంటనే ప్రారంభించే వారు. కానీ, రేవంత్ సర్కారు పాలనలో మాత్రం అలాంటి ఏర్పాట్లు జరుగలేదు.

### రబీ సాగేదేలా?

మరోవైపు, రబీ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల నార్లు పోయడం ప్రారంభించారు. అయితే, విత్తనాలు, ఎరువుల కోసం చేతిలో చిల్లిగవ్వ లేక కర్షకులు సతమతవుతున్నారు. కేసీఆర్ హయాంలో పంట సాగుకు ముందే ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతుబంధు ఇచ్చి అన్నదాతలకు అండగా నిలిచారు. అలాగే, పంట అమ్మిన తర్వాత నాలుగైదు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే వారు. కానీ, కాంగ్రెస్ వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పటికే వానాకాలం రైతుబంధు డబ్బులను రేవంత్ సర్కారు ఎగ్గొట్టింది. రబీలోనూ ఇస్తారన్న నమ్మకం లేకుండా పోయింది. కనీసం పంట పైసలు వస్తే అయినా పెట్టుబడికి ఉపయోగపడతాయని అనుకుంటే అవి కూడా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులకు మేలు చేసే కేసీఆర్‌ను దూరం చేసుకుని అనుభవిస్తున్నామని చెబుతున్నారు.

### రైతుల నిరీక్షణ..

వానాకాలంలో సాగు చేసిన వరిని కోసి ఆరబెట్టిన రైతులు కొనుగోళ్ల కోసం రోజుల తరబడి నిరీక్షించారు. సర్కారు ముందస్తు ఏర్పాట్లు లేకపోవడంతో ధాన్యం సేకరణలో జాప్యం జరిగింది. మరోవైపు, మొదట్లో కొబ్బరికాయలు కొట్టి కేంద్రాలను ప్రారంభించిన అధికారులు.. రైసుమిల్లులు కేటాయించకపోవడంతో కాంటాలు వేయడం ప్రారంభం కాలేదు. దీంతో పక్షం రోజులకు పైగా కొనుగోళ్లు ఊపందుకోలేదు. రైతులు ఆగ్రహిస్తున్న తరుణంలో యంత్రాంగం కాంటాలు వేయడం ప్రారంభించింది. పంట కోసిన నెల రోజులకు అన్నదాతలు వడ్లు అమ్ముకున్నారు.

### డబ్బులు రాలే..?

ఏదో విధంగా పంట విక్రయించుకున్న రైతులకు ఇప్పుడు మరో సమస్య వచ్చి పడింది. పక్షం రోజులైనా ధాన్యం డబ్బులు రాకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నది. గతంలో కొనుగోలు జరిగిన రెండు, మూడు రోజుల్లో లేదా వారం లోపే ధాన్యం డబ్బులు ఖాతాల్లో పడేవి. కానీ ఇప్పుడు ప్రభుత్వ అలసత్వమో, అధికారుల నిర్లక్ష్యమో ఏమో కానీ పక్షం రోజులైనా డబ్బులు పడడం లేదని రైతులు వాపోతున్నారు. కొనుగోళ్లు జరిగిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ వారం, పది రోజులు దాటుతున్నా డబ్బులు మాత్రం రావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### పక్షం రోజులైనా డబ్బులు పడలేదు



వడ్లు అమ్మి పదిహేను రోజులు అయిపోయింది. ఇప్పటికీ వడ్ల డబ్బులు రాలే. మా గ్రామంలో చాలా మంది రైతుల పరిస్థితి ఇదే. ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవటమే తప్ప చేసిందేమి లేదు. కాంగ్రెస్ అచ్చినంక రైతులకు బాధలే తప్ప ఎలాంటి లాభం లేదు. రైతుల సమస్యను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో ఆలోచించాలి. వడ్ల పైసలను వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలి.

**- కోతి శేఖర్‌రెడ్డి, రైతు, దుబ్బాక**



## రుచికరమైన భోజనం అందించాలి

- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశం
- కేజీబీవీ, మోడల్ స్కూళ్ల తనిఖీ



కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో అన్నాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

జక్రాన్‌పల్లి, నవంబర్ 23: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని, ఆదర్శ పాఠశాలను శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్‌కు వెళ్లిన ఆయన.. సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతతోపాటు విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని సైతం క్షుణ్ణంగా పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు, వంటకు వినియోగించే పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్టోర్‌రూమ్‌లో గోధుమ పిండి ఇతర ప్యాకెట్లు తెరిచి ఉండటాన్ని గమనించిన కలెక్టర్.. అవి కలుషితం కాకుండా జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. విద్యార్థినులను పలుకరించి వారికి అందిస్తున్న భోజనం, సదుపాయాలు, విద్యాబోధన, రోజువారీ దినచర్యపై ఆరా తీశారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ కిరణ్మయి తదితరులు ఉన్నారు.

## 'వర్గీకరణ జాప్యానికి రేవంతే కారణం'

### మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేతలు



ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాదిగపోరాట సమితి నేతలు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 23 : తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు జాప్యానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కారణమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డిలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి సమావేశంలో జాతీయ నాయకుడు మంథని సామ్యూల్ మాదిగ మాట్లాడుతూ.. రేవంత్‌పై మండిపడ్డారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణలో ఇప్పటికీ ఇంకా అమలు కాకపోవడానికి ముఖ్యమంత్రే కారణమన్నారు. వర్గీకరణ సాధించుకున్న తర్వాత కూడా అమలు పరచకుండా.. 11062 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి మాదిగ జాతికి తీరని ద్రోహం చేశాడన్నారు. వర్గీకరణ అమలయ్యే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు వెంకట్రాములు మాదిగ, కంతి పద్మారావు మాదిగ, సట్టిగారి లక్ష్మి మాదిగ, బాలరాజు మాదిగ, లావణ్య మాదిగ తదితరులున్నారు.